క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఆలయం

నెల్లిమర్ల: పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నిర్మించిన శ్రీవేంకటాచల దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభం, విమానశిఖర ప్రతిష్ట కార్యక్రమాలు మంగళవారం నుంచి మూడురోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

నలుగురు వీఆర్వోలకు బదిలీ

నెల్లిమర్ల: మండలంలో పనిచేస్తున్న నలుగురు వీఆర్వోలు బదిలీపై వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో నెల్లిమర్ల మండలానికి చెందిన ముగ్గురు, నగరపంచాయతీకి చెందిన ఒకరు ఉన్నారు. నగరపంచాయతీ పరిధి ఇందిరా కాలనీ వార్డు సచివాలయం వీఆర్వో వి.జగదీశ్‌కు విజయనగరం మండలం జొన్నవలస గ్రామానికి బదిలీ అయింది. సారిపల్లి వీఆర్వోగా పనిచేస్తున్న కె.సురేష్‌కు గుర్ల మండలం కొండగండ్రేడు గ్రామానికి, జరజాపుపేట వీఆర్వో ఎం.సౌజన్యకు డెంకాడ మండలం అమకాం గ్రామానికి, ఒమ్మి వీఆర్వో కె.మధుసూదన్‌కు డెంకాడ మండలం గుణుపూరుపేట గ్రామానికి బదిలీ అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



డిప్యూటీ స్పీకర్ కోలగట్లను కలిసిన ఏడీ కిరణ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: విద్యుత్‌శాఖ టౌన్ ఏడీగా ఎ.కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మధురవాడ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ముందుగా విద్యుత్ శాఖ ఎస్‌ఈ లక్ష్మణరావును కలిసి విధుల్లో చేరారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



మెంబర్‌షిప్ నమోదు చేయించుకుంటున్న విద్యార్థులు

డెంకాడ: గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ వై.మహేష్ కోరారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మెంబర్‌షిప్ నమోదు చేసుకోవడం ద్వారా విద్యార్థులు వారికి నచ్చిన పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లి చదువుకోవచ్చన్నారు. ఈ నెల 11న వేసవి శిక్షణ శిబిరాలు ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మెంబర్‌షిప్ నమోదు చేసుకున్నారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు



కలెక్టర్‌ని కలిసిన కర్లాం గ్రామ దళితులు

విజయనగరం అర్బన్: గ్రామంలోని దళితులకు సంబంధించిన శ్మశాన వాటిక స్థలాన్ని కొంతమంది అగ్రకులస్తులు ఆక్రమించుకుంటున్నారని, ఆక్రమణను అడ్డుకోవాలని చీపురుపల్లి మండలం కర్లాం గ్రామ దళితులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని దాదాపు 73 సెంట్ల స్థలాన్ని గతకొన్నేళ్లుగా శ్మశానవాటికగా వాడుకుంటున్నామని, క్రమంగా ఆక్రమణకు గురికావడంతో ప్రస్తుతం 10 సెంట్ల స్థలం మాత్రమే మిగిలి ఉందన్నారు. ఆక్రమించిన స్థలాన్ని ఖాళీ చేయించి అప్పగించాలని కోరారు.

32మద్యం సీసాలు పట్టివేత

గజపతినగరం: మండలం కేంద్రంలోని దియా రెస్టారెంట్ సమీపంలో పాన్‌షాప్ వద్ద అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న ఓవ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. మరుపల్లి గ్రామానికి చెందిన గెద్ద జగన్నాథం 32మద్యం సీసాలతో పట్టుబడడంతో అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను సీజ్ చేసినట్లు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



విజయనగరం ఫోర్ట్: మొక్కకు నీరు పోస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరావు

విజయనగరం ఫోర్ట్: పర్యావరణాన్ని కాపాడుకొనేందుకు ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ప్లాస్టిక్ సంచులకు బదులు గోనె సంచులు వినియోగించాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కర్బన ఉద్గారాలను వెలువడించే ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని, పాలిథిన్ సంచులను పూర్తిగా నిషేధించాలని, మొక్కలను సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ పి.రవికుమార్, డీఏఓ డాక్టర్ శృతి, డాక్టర్ శైలజ, డెమోలు చిన్నతల్లి రమణ, డీపీహెచ్ఎన్ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో మానవ మనుగడకు ముప్పు

నెల్లిమర్ల రూరల్: ప్లాస్టిక్ వాడకంతో మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతోందని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి వద్ద ఉన్న సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరో పదేళ్లలో భూగోళ ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ పెరగవచ్చని క్లైమేట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ఉష్ణోగ్రతలు అదుపు చేయకపోతే భూతాపం పెరిగి తీవ్రమైన కరువు, కార్చిచ్చు, వరదలు వంటి విపత్తులు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 400 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతోందని, అందులో 10శాతం మాత్రమే రీసైకిల్ అవుతోందన్నారు. నదులు, సరస్సులు, సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం నుంచి గట్టెక్కాలంటే అందరిలోనూ చైతన్యం రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని నెల్లిమర్ల నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గాంధీనగర్ కాలనీ సచివాలయం ఆవరణలో, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, 14వ వార్డు కౌన్సిలర్ జానా సంధ్యారాణి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

పూసపాటిరేగ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పతివాడ, తిప్పలవలస జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. 500 వరకు కొబ్బరి, మామిడి మొక్కలను నాటారు. మొక్కలతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీడీఓ జి.రామారావు, హెచ్‌ఎం సీహెచ్.అరుణకుమారి, సర్పంచ్ పైడిరామ్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు చిట్టిబాబు, త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు



విజయనగరం: మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



భోగాపురం: మహిళా సంఘం సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు

ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంతో ముప్పు

భోగాపురం: ప్రజలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగానికి దూరంగా ఉండాలని ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఏపీఎం రమణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో డ్వాక్రా సంఘాల మహిళలతో కలిసి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ఏవిధంగా హాని చేస్తాయో వివరించారు. ప్లాస్టిక్ బ్యాగులకు బదులు కాగితం లేదా గోగుతో చేసిన సంచులను వినియోగించాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఓ దాసరి బంగారయ్య, ఈఓపీఆర్డీ సురేష్, వీఓ హరికృష్ణ, ఏపీఓ ఆదిబాబు, పశువైద్యాధికారి రామరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని రెడ్ క్రాస్ కార్యదర్శి పి.సత్యం అన్నారు. స్థానిక ఎం.ఆర్.కళాశాల రెడ్‌క్రాస్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధించాలని, గుడ్డ సంచులను వినియోగించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, రెడ్ క్రాస్ ప్రతినిధులు రామకృష్ణారావు, చంద్రశేఖర్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే సామాజికాభివృద్ధి

విజయనగరం: పర్యావరణ పరిరక్షణతోనే సామాజికాభివృద్ధి ముడిపడి ఉందని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు, విజయనగర మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తోటపాలెం తిరుమల నర్సింగ్ హోంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుస్థిరాభివృద్ధికి పర్యావరణ పరిరక్షణ అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి, పేపర్ కవర్లను వినియోగించాలని, మొక్కలను పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు అబ్దుల్ రవూఫ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: మొక్క నాటుతున్న నగరపంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని



పూసపాటిరేగ: పతివాడ ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు



విజయనగరం ఫోర్ట్: ప్లాస్టిక్ వాడాకాన్ని నిషేధించాలని ప్రచారం చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..

- ఉత్సాహంగా సాగుతున్న 'గడపగడపకు మన ప్రభుత్వం'
- స్థానిక సమస్యల పరిష్కారంపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రత్యేక దృష్టి



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోన్న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఉత్సాహంగా కొనసాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని 27వ డివిజన్ 33వ నంబరు సచివాలయం పరిధిలోని జొన్నగుడ్డి, మజ్జివీధి, తదితర ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ప్రతీ గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ప్రభుత్వ పని తీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మజ్జివీధిలో కాలువల నిర్వహణ సరిగా లేదని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా.. ఆయన వెంటనే సంబంధిత అధికారులను పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు 180 పనులు గుర్తించగా 57 పనులకు టెండర్ ప్రక్రియ పూర్తిచేసినట్లు చెప్పారు. స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో తమ డివిజన్ పరిధిలోని ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దుప్పాడ అప్పారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పలనాయుడు

భోగాపురం: మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే 'జగనన్నకు చెబుదాం'(స్పందన) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాయలంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు వీలుంటుదన్నారు. ప్రజలు 1902 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ దాసరి బంగారయ్య, ఈఓపీఆర్డీ సురేష్, ఏపీఓ ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి పరామర్శ



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: మండలంలోని కొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన మైలపిల్లి పెద్దయ్య(30), పావని(25) దంపతులు ఆదివారం విశాఖపట్నం బీచ్ రోడ్డులో జాలరిపేట వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి సోమవారం కొండ్రాజుపాలెం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ వైస్ సర్పంచ్ కోరాడ చిన్నరావు, తదితరులు ఉన్నారు.

11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జె.పద్మలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బ్లూ లేదా, బ్లాక్ పెన్ను తీసుకురావాలని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



కొండగుంపాంలో సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీఓ గిరిబాల సూచించారు. మండలంలోని గరికిపేట, మొయిద, కొండగుంపాం గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయ, రైతు భరోసా భవనాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. భవన నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కోరారు. తాగునీరు, పారిశుద్ధ్యం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పతివాడ అప్పన్న, అట్టాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీలో వస్తున్న మార్పులను తెలుసుకోవాలి

- జీ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

డెంకాడ: సాంకేతిక విద్యలో వర్క్‌షాప్‌ల నిర్వహణతో ఎంతో ప్రయోజనం ఉంటుందని జీ ప్రోగ్రాం డైరెక్టర్, సమీర్ సెంటర్ ఫర్ ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎన్విరాన్మెంటల్ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ డాక్టర్ బండారు సుబ్బారావు అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్టీ, సెర్బ్ సహకారంతో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో డిజైట్ అండ్ సిములేషన్స్ ఆఫ్ మినియేచర్ యాంటెనా యూజింగ్ మెషిన్ లెర్నింగ్ ఫర్ ఐఓటీ అప్లికేషన్స్ అనే అంశంపై ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక విద్యలో మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు, కోఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, ఈసీఈ విభాగాధిపతి మస్తాన్, డీన్ రమేష్, అధ్యాపకులు ఆంజనేయులు, లక్ష్మణ్, ఉజ్వల, క్రాంతిప్రభ, శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



గజపతినగరం: అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామపెద్దలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.సుబ్బారావు, కాశీ విశ్వనాథం, సూర్యనారాయణ ఉదయం నుంచి గ్రామస్తులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.ఆలయం వద్ద మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి సుమారు మూడు వేల మంది భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. గ్రామ పెద్దలు గురుగుబిల్లి సత్యనారాయణ, జి.కృష్ణ, ప్రతాప్, ఎం.సత్యారావు, గురుగుబిల్లి లక్ష్మునాయుడు, కె.చిన్నయ్యస్వామి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేట గ్రామంలో రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, గ్రామపెద్దలు సోమవారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు రమణమ్మ, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, పోరలి పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య

- టీడీపీ వారికే ఆ పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి చేరికలని దుష్ప్రచారం
- టీడీపీ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారు
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మోసపూరిత హామీలు, మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టడంతో పాటు ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని దుష్ప్రచారాలు చేయించడం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎద్దేవా చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు మళ్లీ మోసపూరిత హామీలు ఇస్తున్నారని, ఆయన్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. ఇటీవల గంట్యాడ మండలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారని ఓ పత్రికలో వచ్చిన వార్తను ఆయన ఖండించారు. టీడీపీ వారికే టీడీపీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి తమ పార్టీలో చేరారని టీడీపీ నాయకులు తమ అనుకూల పత్రికల్లో రాయించుకుని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి ఎన్నికల ముందు టీడీపీ నేతలు చేస్తున్న ఇదో రకమైన కొత్త ఎత్తుగడని అన్నారు. గతం లో దత్తిరాజేరు మండలంలో కూడా ఇదే విధంగా ప్రచారం చేశారని మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు చేసే మోసాలు, మాయలను ఆ పార్టీ కింది స్థాయి నాయకులు కూడా చేస్తుండడం ఆనవాయితీగా మారిపోయిందని అన్నారు. గతంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు వాటిలో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ఆయన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదని చెప్పారు.

రూ. 110 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు

గజపతినగరం నియోజకవర్గంలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 110 కోట్లతో జలజీవన్ మిషన్ పనులకు (ఇంటింట కుళాయలు) త్వరలోనే టెండర్లు పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే అప్పలనరసయ్య తెలిపారు. కుళాయిల పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని చెప్పారు. అవినీతికి తావులేకుండా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో వివిధ పథకాలకు సంబంధించి నియోజకవర్గ ప్రజల ఖాతాల్లో రూ. 980 కోట్లను జమ చేశామని, అలాగే సుమారు రూ.750 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని స్పష్టం చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని చూసి టీడీపీ ఓర్వలేక కుట్రపూరిత రాజకీయాలు, దుష్ప్రచారాలు చేస్తోందని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని మళ్లీ టీడీపీకి గుణపాఠం చెబుతారని అన్నారు. గజపతినగరం ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కర్రి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పూతికపేటలో 'గడపగడపకు..'

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట గ్రామంలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిబాల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30లకు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అందుబాటులో ఉండాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దత్తిరాజేరు: రామభద్రపురం మండలం పారాది గెడ్డ నుంచి కె.కొత్తవలసకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను చౌదంతివలస సమీపంలో ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్.బూర్జవలస ఎస్సై జి.రాజేష్ సోమవారం తెలిపారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సేవలే గుర్తింపునిస్తాయి



ఎంపీడీఓ వేదవతిని సన్మానిస్తున్న ఎంపీపీ

బొండపల్లి: ఏ రంగంలో అయినా చేసిన సేవలే తగిన గుర్తింపు ఇస్తాయని ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్య ప్రకాశరావు అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసి జిల్లా పరిషత్ కార్యాలయానికి ఏఓగా బదిలీ అయిన ఏ.వేదవతిని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఎస్.జి.ఎన్.ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, ఏపీఓ కృష్ణవేణి, ఏపీఎం సులోచనాదేవి, సీనియర్ సహాయకులు డి.వెంకటరమణ, ఒంపల్లి సర్పంచ్ లండా నారాయణమ్మ, పెద్దమజ్జి గోపి పాల్గొన్నారు.